## క్లుప్తంగా

### 'గడప గడపకూ' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

**కపిలేశ్వరపురం:** కేదారిలంక గ్రామంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద సోమవారం కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఎల్‌ఓ జగన్, కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, గ్రామ అధికారులు, సచివాలయం ఉద్యోగులతో కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. కేదారిలంక లక్ష్మి వినాయకాలయం వద్ద నుంచి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తన గ్రామ పర్యటను ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో సచివాలయ కన్వీర్లు వీధి గంగాధరరావు, యర్రంశెట్టి నాగేంద్రరావు, కాశి శ్రీను, పాల్గొన్నారు.

### శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

**రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్:** పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. సోమవారం పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రత్న పద్మావతి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సౌజన్యంతో పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. సమావేశంలో ఏఎంఓ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడానికి జగనన్న ఆణిముత్యాలు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 2011-12 విద్యా సంవత్సరం పూర్వ విద్యార్థులు సౌజన్యంతో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో నిలిచిన విద్యార్థులకు కంపాస్ బాక్స్, మెమెంటో, పరీక్ష అట్ట, పెన్ను అందజేశారు. అంతకుముందుగా ఆయన ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు అద్దంకి గోవిందరాజు, పసుపులేటి మెహర్ సుజాత, అరవ విస్సు, కోడి ప్రసాద్, పూర్వ విద్యార్థులు తోలేటి సూర్య, కిరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రామికుల సమస్యలు పరిష్కరించాలి

**కపిలేశ్వరపురం:** విస్తారంగా ఉన్న అసంఘటిత రంగ శ్రామికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి కోరారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తదిత చిరుద్యోగులకు ప్రభుత్వ పథకాలన్నీ అమలు చేయాలన్నారు. వారి శ్రమను గుర్తించి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కృష్ణవేణి కోరారు.

### రేపు డయల్ యువర్ డీఎం

**రామచంద్రపురం రూరల్:** ఈ నెల 13న బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ ప్రయాణికులు, ప్రజలు ఫోన్ నంబర్ 99592 25536కు డయల్ చేసి తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

### కపిలేశ్వరపురం తహసీల్దార్‌గా రాజరాజేశ్వరి



**కపిలేశ్వరపురం (మండపేట):** స్థానిక మండల తహసీల్దార్‌గా రాజరాజేశ్వరి సోమవారం బాధ్యతలను చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ తహసీల్దార్‌గా పని చేసిన కొమరం సూర్యారావు ఎన్టీఆర్ జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్ రాజరాజేశ్వరిను కార్యాలయ ఇతర అధికారులు, డిప్యూటీ తహసీల్దార్ పి.వెంకటేశ్వరరావు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు తహసీల్దార్ రాజరాజేశ్వరిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

### సంక్షేమ సారథి సీఎం జగన్

**కపిలేశ్వరపురం (మండపేట):** పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనార్థం విశేష కృషి చేస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు అన్నారు. మండపేట మండలం కేశవరంలో సోమవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ముక్క పాటి శ్రీనివాస్, వార్డ్ సభ్యులు అల్లంపల్లి కిశో ర్, గణిశెట్టి సత్తిబాబు, నాయకులు మన్నే బాబీ, నున్న రాంబాబు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

**కపిలేశ్వరపురం (మండపేట):** ఆత్మీయులను కోల్పోయి బాధల్లో ఉన్న మండపేట పట్టణానికి చెందిన చింతల శ్రీనును, గొర్లె అక్కమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

# మా కళాశాలలో చేరండి

- విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఊళ్ల బాట పట్టిన అధ్యాపకులు
- గ్రామాల్లో ఇంటింటా ప్రచారం
- జూనియర్ కళాశాల మనుగడకు ముందస్తు చర్యలు




రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాలలో చేరికలకు ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

**రాయవరం:** విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించేందుకు అధ్యాపకులు ఇళ్లబాట పట్టారు. సర్కారు కళాశాల్లో ఉండే సదుపాయాలు, చదువులపై అవగాహన కల్పిస్తున్నారు. రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల చేరికకు అధ్యాపకులు ముందుగానే గ్రామాల్లో పర్యటిస్తున్నారు. జూనియర్ కళాశాలలో చేరికలకు ఇంకా ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించకున్నా.. తమ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆరాట పడుతున్నారు. ఎక్కువ మందిని చేర్పించాలనే సదుద్దేశంతో విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రచారం చేస్తున్నారు. అధ్యాపకులంతా గత కొన్నేళ్లుగా గ్రామాల్లో తిరుగుతూ కళాశాలలో ఉండే సదుపాయాలను వివరిస్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు.

**కళాశాల మార్పునకు ఎమ్మెల్సీ తోట కృషి**

రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇప్పటి వరకు గ్రామానికి దూరంగా ఉండడంతో చేరికలు అంతంతమాత్రంగానే ఉండేవి. ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవలనే ప్రభుత్వ కళాశాలను స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషి మేరకు గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కళాశాల గ్రామంలో ఏర్పాటు చేయడంతో విద్యార్థులతో పాటు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రయోజనాలను వివరిస్తూ**

రాబోయే విద్యా సంవత్సరంపై అధ్యాపకులు ఆశలు పెట్టుకున్నారు. కళాశాల గ్రామంలోకి రావడంతో విద్యార్థుల చేరికలు పెరిగే అవకాశముంది. కళాశాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడంతో అధ్యాపకులు కూడా నూతనోత్సాహంతో పని చేస్తున్నారు. కళాశాల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలలకు వెళ్లి పదవ తరగతి విద్యార్థులను రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతున్నారు. ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అంగీకారాన్ని తీసుకుంటున్నారు.

**ప్రస్తుత విద్యా సంవత్సరం పరిస్థితి ఇది**

ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులున్నాయి. ప్రస్తుతం ఎంపీసీ-15, బైపీసీ-10, సీఈసీ-18, హెచ్‌ఈసీ గ్రూపులో 12 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ-04, బైపీసీ-04, సీఈసీ-08, హెచ్‌ఈసీ గ్రూపులో 11 మంది విద్యనభ్యసించారు. ఫస్టియర్, సెకండియర్ నాలుగు గ్రూపులకు కలిపి 160 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా, కేవలం 82 మంది అడ్మిషన్లు జరిగాయి.

**ఇంటిబాట పట్టిన అధ్యాపకులు**

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రాయవరం, లొల్ల, సోమేశ్వరం, వెదురుపాక, వి.సావరం, బిక్కవోలు మండలంలోని కొమరిపాలెం, పందలపాక, కొంకుదురు, అనపర్తి మండలంలోని మహేంద్రవాడ, కొప్పవరం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారు. ఇదిలా ఉంటే విద్యార్థుల సంఖ్యపైనే కళాశాల మనుగడ ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అధ్యాపకుల భవిష్యత్ కూడా విద్యార్థుల సంఖ్యపైనే ఆధారపడి ఉండడంతో అధ్యాపకులు విద్యార్థుల కోసం ఇంటిబాట పట్టారు.

**విద్యార్థుల చేరికలు పెంచే దిశగా..**



కళాశాలలో విద్యార్థుల చేరికలను పెంచేందుకు అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. సబ్జెక్టు అధ్యాపకులు తగినంతగా ఉన్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య కచ్చితంగా పెరుగుతుందని ఆశిస్తున్నాం. రహదారి చెంతనే ఉండడం, బస్ సౌకర్యం ఉండడంతో విద్యార్థులు అధికంగా చేరుతారని ఆశిస్తున్నాం. గతేడాది ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విద్యార్థి 973, బైపీసీ విద్యార్థికి 868 మార్కులు వచ్చాయి.

– దారపు వీర వెంకట నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయవరం

### సత్యనారాయణపురంలో సీసీ రహదారి నిర్మాణం



సత్యనారాయణపురం సీసీ రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జేఈ

**కపిలేశ్వరపురం:** అచ్యుతాపురం గ్రామ శివారు సత్యనారాయణపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ జేఈ డీవీ రాఘవులు సోమవారం పరిశీలించారు. గ్రామానికి మంజూరైన రూ.8 లక్షల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. పారదర్శకంగానూ, నాణ్యతతోనూ నిర్మితమవుతున్న రహదారిని త్వరిత గతిని వినియోగంలోకి తీసుకొస్తామని రాఘవులు, కాలేరు గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ తులసి అన్నారు. నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులను గ్రామ ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, పీఏసీఎస్ చైర్మన్ చుండ్రు అమ్మన్న, కామాడి శ్రీను, మత్సా వీరబాబు, పెమ్మాడి కామేశ్వరరావు, కామాడి లక్ష్మణుడు, మత్సా కూనరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# వైఎస్సార్ సీపీలో చేరికలు



మండపేటలో పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ తోట తదితరులు

**కపిలేశ్వరపురం (మండపేట):** మండపేట పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా కమిటీ అధ్యక్షుడు చోడే సత్యకృష్ణ, పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి చోడే శ్రీకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం 50 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. మండపేట మండలం అర్తమూరు, ఏడిద గ్రామాలకు చెందిన తిప్పా ప్రసాద్ ఫ్రెండ్స్ సర్కిల్‌కు చెందిన యువకులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, జిల్లా రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి అభినందించారు. సత్యకృష్ణ, శ్రీకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో విద్య, ఉపాధి రంగాలు అభివృద్ధి జరగడంపై యువత ఆకర్షితులవుతున్నారన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ పార్టీలో చేరిన యువకులను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంను చేసుకునేందుకు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ శ్రీధర్, పైడిమళ్ళ చిన్న, గుంటూరు బబ్లు, సిలి ప్రకాష్, పైడిమళ్ళ సిద్దు, ముఖేష్, గుమ్మడి భూషణం, ఓల్లూరి ప్రిన్స్ , సిలి కిషోర్, గెడ్డం చింటూ, సీలి భాను, మందపల్లి రాహుల్, మందపల్లి సునీల్, మందపల్లి సతీష్, పెందుర్తి రాజు, పెందుర్తి చిట్టిబాబు, లంక సుధీర్, ఓసెట్టి మధు, సబెళ్ళ కిరణ్ పాల్గొన్నారు.

# ఆరు అంశాలకు కౌన్సిల్ ఆమోదం



పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన సూర్యప్రకాష్ తదితరులు

**రామచంద్రపురం:** స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 7 అంశాలను కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. తొలుత అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లతో పాటుగా విద్యుత్ స్తంభాల మార్పులు పట్టణంలోని ట్రేడింగ్ లైసెన్స్‌ల ఫీజు తగ్గింపు తదితర అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కాగా 7వ అంశంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్లకు జీతాల పెంపుపై కౌన్సిలర్ల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. ప్రభుత్వం పెంచిన జీతాలను మున్సిపాలిటీ జనరల్ ఫండ్స్ నుంచి ఇచ్చే విధంగా చైరపర్సన్ ర్యాటిపై చేసిన అంశానికి కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. దీనిపై కొంత మంది అభ్యంతరం వ్యక్తం చేశారు. పెంచిన జీత భత్యాలను జనరల్ ఫండ్స్ నుంచి ఇచ్చేందుకు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ అంశాన్ని వాయిదా వేయాలని కోరగా చైర్‌పర్సన్ దీనిని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఏడు అంశాలకు గాను ఆరు అంశాలకు కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్‌లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్‌లు కోటిపల్లి లక్ష్మి, బొక్కా సత్యనారాణ, కట్టా శ్రీరాములు, కమిషనర్ బి.శ్రీనివాసులు, డీఈ డి.దుర్గాప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ**

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద జ్యోతిరావు పూలే విగ్రహాన్ని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ ఆవిష్కరించారు. పార్టీ నేత మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి, ప్రముఖ వైద్యులు, డాక్టర్ సి.స్టాలిన్, మోడర్ విద్యా సంస్థల అధినేత జీవీరావు, వైఎస్సార్ సీపీ పార్టీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీదర్, పార్టీ నేతలు కట్టా సూర్యనారాయణ, కొనసా ప్రసాద్, పెంటపాటి శ్రీను, సత్తిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు ఆర్థిక భరోసా

**కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్**



వైఎస్సార్ చేయూత చెక్కు అందజేస్తున్న సూర్యప్రకాష్

**రామచంద్రపురం:** రాష్ట్ర ఆర్థికాభివృద్ధి జరగాలంటే మహిళలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఆర్థిక భరోసాను కల్పించిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులు విడుదల కార్యక్రమం సందర్భంగా పట్టణానికి చెందిన మహిళా సంఘాలకు రూ.7.31 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ మహిళలకు పెద్దపీట వేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు రూపకల్పన చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మహిళలందరూ మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. అయిదేళ్ల కాలంలో మహిళాభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలు తిరిగి అమలు కావాలంటే తప్పనిసరిగా వైఎస్సార్ సీపీని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలను రద్దు చేసేందుకు అధికార దాహంతో వస్తున్న కూటమిని ఓటుతో దెబ్బకొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ అంబటి భవాని, మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్లు చింతపల్లి నాగేశ్వరావు, కోలమూరి శివాజీ, కమిషనర్ బి.శ్రీనివాసులు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఆర్‌పీలు, మెప్మా సిబ్బంది, తదతరులు పాల్గొన్నారు.

# ప్రజల భరోసా కోసమే ఫ్లాగ్ మార్చ్

- ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి
- డీఎస్పీ రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ

**రాయవరం:** ఎన్నికలు సజావుగా పూర్తి చేయడానికి శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్ ఎంతో ఉపయోగపడుతుందని రామచంద్రపురం డీఎస్పీ కె.రామకృష్ణ తెలిపారు. మండలంలోని చెల్లూరులో సోమవారం ప్రత్యేక దళం పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు నిత్యం ప్రజల వెన్నంటి ఉన్నారనే నమ్మకం కలిగించడమే ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశమన్నారు. అనంతరం ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యం, వినియోగంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో డీఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో పవిత్రమైందన్నారు. ఓటు హక్కును సక్రమంగా, సమర్థవంతంగా, నిజాయతీగా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ప్రజలు శాంతియుత వాతావరణానికి సహకరించాలన్నారు. ఎన్నికల సమయంలో యువత సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టింగ్‌లు పెట్టవద్దని, ప్రభావితం కావద్దని, ఎటువంటి కేసుల్లోను ఇరుక్కుని, భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితులను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తుందన్నారు. సమావేశంలో మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, రాయవరం ఎస్సై జి.నరేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

### డస్ట్‌బిన్ల పంపిణీ

**రాయవరం:** పారిశుధ్య నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులకు డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమిస్తుందని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి కుటుంబానికి రెండు డస్ట్ బిన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 12 గ్రామ పంచాయతీలకు 33,380 డస్ట్‌బిన్లను అందజేశారు. ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాస్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



శీలలో గడప గడపకూ వెళ్లి పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న నాయకులు



తామరపల్లిలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**కాజులూరు:** రాష్ట్రంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరికం అనుభవిస్తున్న కుటుంబాలకు ఆర్థిక పరమైన తోడ్పాటు అందించాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు అన్నారు. మండలంలోని శీల, ఒంటితాడి తదితర గ్రామాల్లో సోమవారం మండల గ్రామాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా పర్యటించి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి కలిగిన లబ్ధిని వివరించారు. సర్పంచ్ కొమలి వెంకటరమణ ఆధ్వర్యంలో వలంటీర్లు, పార్టీ కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి జగనన్న పథకాల ద్వారా ఏ ఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ ప్రభుత్వ పథకాలు వారు మరింత సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. సంక్షేమాన్ని ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చేందుకు వలంటీర్ వ్యవస్థను, సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతీ, మండల పార్టీ నాయకులు నల్లమిల్లి రామారెడ్డి, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, కుయ్యేరు సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్, దొమ్మేటి కొండ, కాకి శ్రీనివాసరావు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

**కాజులూరు:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వాటిని ప్రజలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేలా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నేత, గొల్లపాలెం మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ అన్నారు. సోమవారం గ్రామంలో పార్టీ యువజన విభాగం కార్యదర్శి నిమ్మతి విజయ్ అధ్యక్షతన జరిగిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సీఎం జగనన్న పనిచేస్తున్నారని సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లతో సమష్టిగా పనిచేసి జగనన్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మాదిరెడ్డి చిట్టిబాబు, మాదిరెడ్డి పృథ్వీ, వైఎస్సార్ సీపీ నాయకులు ఉంగరాల శివ, టేకుమూడి దుర్గారావు, చొల్లంగి వెంకన్న, పెంటపాటి శ్రీను, డీఈ జయప్రద పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రతి గడపకూ సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం**

**కె.గంగవరం:** ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్‌లు సలాది శిరీష, తోకల మంగ, అనుసూరి సాయి అన్నారు. మండలంలోని దంగేరు, సుందరపల్లి, తామరపల్లి, శివల గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందిన సంక్షేమ పథకాల గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ అందించాలనే ఉద్దేశంతో నవరత్నపథకాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎవరి వద్దకు వెళ్లకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో లబ్ధిదారులంతా సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు బత్తుల అప్పారావు, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, మండల యువజన నాయకులు జుత్తుక శ్యాం ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు సాదా వెంగళరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు అడపా నారాయణస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు చిట్టూరి చిన్ని, నానాపరపు శ్రీనివాస్, యంటపల్లి నాని, జంగం సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలి

**కపిలేశ్వరపురం (మండపేట):** పాఠశాల విద్యార్థులు తమ రోజువారీ జీవితంలో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని రిటైర్డ్ ఉపాధ్యాయులు గెడా శ్రీనివాసు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మండపేట మండలంలోని ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక తరగతిని నిర్వహించారు. సరస్వతీ పూజలో అభిషేకించిన పెన్నులను విద్యార్థులకు అందజేశారు.

### పోషణ్ పక్వాడా పథకంపై అవగాహన అవసరం

**కపిలేశ్వరపురం:** ఐసీడీఎస్ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడా పథకంపై ప్రజలకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ అంగర సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిధి అంగరలోని 31 వ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమంపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 9వతేదీ నుంచి 27 వరకూ పోషణ పక్వాడా కార్యక్రమాలను ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ జరుగుతున్నాయన్నారు.

# భవనాలను ప్రారంభించిన ఎంపీ బోస్



హసన్‌బాదలో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ సుభాష్‌చంద్రబోస్

**రామచంద్రపురం రూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో రూ.412.40 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు, అభివృద్ధి పనులను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో కలసి సోమవారం ప్రారంభించారు. ఎంపీ బోస్ స్వగ్రామం హసన్‌బాదలో ఎంపీ నిధులు రూ.56 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాలు, రూ.35 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలు, రూ.56 లక్షలతో అభివృద్ధి చేసిన శ్మశాన వాటికలను గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్, ఎంపీటీసీ యెన్నం దేవిల ఆధ్వర్యంలో ఎంపీ బోస్ ప్రారంభించారు. ద్రాక్షారామలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు ఒక్కోదానికి రూ.40 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకేలను సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. అదే విధంగా వెంకటాయపాలెం, కందులపాలెం, యనమదల గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు యల్లమిల్లి సతీష్‌కుమారి, పెంకే కృష్ణవేణి, పంపన వీరవెంకటరమణల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, ఎంపీటీసీలు కణితి వెంకటేశ్వరి, గుత్తుల అచ్యుతవేణి, నురుకుర్తి శ్రీరామకృష్ణ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.